# దేశ సమైక్యతే పరమావధిగా.. బీఎన్ఎస్2

## భారతీయ న్యాయ (రెండవ) సంహిత-2023

నిన్నటి తరువాయి

**నేర బాధ్యతకు కనీస వయస్సు**

- నేరానికి పాల్పడిన పిల్లలను తాము చేసిన నేరానికి బాధ్యులను చేయడానికి కనీస వయసును నిర్ధారించడమే దీని ప్రధాన ఉద్దేశం. చిన్నారుల ప్రవర్తనపై మెదడు ప్రభావం ఏవిధంగా ఉంటుందో తెలుసుకోవడానికి చేసిన అత్యాధునిక అధ్యయనాల నేపథ్యంలో, చిన్నారులను ఒక నేరానికి ఎంత వరకు బాధ్యులను చేయాలనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ఐ.పి.సి. ప్రకారం ఏడేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలు ఎటువంటి నేరాలకు పాల్పడినా వారిని నేరస్థులుగా పరిగణించబోరు. అయితే తాను చేసిన పనికి ప్రతిఫలం ఏవిధంగా ఉంటుందో తెలియని స్థితిలో నేరానికి పాల్పడితే అటువంటి పిల్లలకు 12ఏళ్ల వరకు శిక్ష నుంచి మినహాయింపు ఉంటుంది. బీఎన్ఎస్2 ఈ నిబంధనలను కొనసాగించింది. 2007 లో ఐక్యరాజ్య సమితి ఈ నేర బాధ్యతను నిర్ధారించే వయస్సును 12 సంవత్సరాల కంటే మరింతగా పెంచాలని దేశాలను కోరింది. ప్రస్తుతం చాలా దేశాల్లో ఈ వయసు మన దేశంలో కంటే ఎక్కువ ఉండటం గమనార్హం. ఉదాహరణకు జర్మనీలో 14 సంవత్సరాలు, ఇంగ్లండ్, వేల్స్‌ల్లో 10 సంవత్సరాలు, స్కాట్లాండ్‌లో 12 సంవత్సరాలుగా ఉంది.


### చిన్నపిల్లలపై నేరాలకు కఠిన శిక్షలు

- చిన్న పిల్లలపై నేరాలకు పాల్పడినవారికి కఠిన శిక్షలను బీఎన్ఎస్2 నిర్ణయించింది.కొన్ని కేసుల్లో మినహాయించి చాలావాటిల్లో 18 సంవత్సరాల వరకు మైనర్లుగా పరిగణిస్తారు. అత్యాచారం, సామూహిక అత్యాచారం, మైనర్లపై అత్యాచారం కేసుల్లో శిక్షలు భిన్నంగా ఉంటాయి. అత్యాచార కేసుల్లో శిక్ష విధించడంలో 18 ఏళ్ల వయస్సు ప్రాధాన్యం వహిస్తుంది. సామూహిక అత్యాచార కేసుల్లో బాధితులు 18 ఏళ్ల వయస్సు లోపు లేదా ఎక్కువ ఉన్నప్పుడు విధించే శిక్షలు భిన్నంగా ఉంటాయి. బాధితుల వయస్సు 12ఏళ్ల లోపు ఉన్నప్పుడు విధించే శిక్షకు, 12–16 మధ్య వయస్సు లేదా అంతకంటే ఎక్కువ వయస్సున్నవారైతే విధించే శిక్షకు తేడా వుంటుంది. లైంగిక నేరాల నుంచి చిన్నపిల్లల రక్షణ చట్టం – 2012కు దీనికి ఎటువంటి సంబంధం లేదు.ఈ చట్టం 18 ఏళ్ల లోపు వయస్కులను మైనర్లుగా పేర్కొంటున్నది.

**నేర న్యాయ చట్టాల్లో మార్పుల సిఫారసులకు ఏర్పాటైన కమిటీలు**

1. **మలిమాథ్ కమిటీ:** ఈ కమిటీని 2003లో కేంద్రం ఏర్పాటు చేసింది. తీవ్రస్థాయి నేరాల్లో బాధితులను కూడా కేసులో పాల్గొనేలా చేయాలని ఈ కమిటీ సిఫారసు చేసింది. బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని కూడా పేర్కొంది.
2. **జస్టిస్ వర్మ ప్యానల్:** మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన నేరస్థుల విచారణను సత్వరం ముగించడం, కఠిన శిక్షలు విధించడానికి వీలుగా సిఫారసు చేయడానికి కేంద్రం జస్టిస్ వర్మ ప్యానల్‌ను ఏర్పాటు చేసింది. ఈ ప్యానల్ తన నివేదికను 2013లో కేంద్రానికి సమర్పించింది.
3. **రణబీర్ సింగ్ కమిటీ:** నేరన్యాయ చట్టంలోని నిబంధనలను సమీక్షించేందుకు కేంద్రం 2020లో ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ముఖ్యంగా ఇండియన్ పీనల్ కోడ్–1860, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్–1973 మరియు ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ –1872.

- చిన్నపిల్లలపై జరిగే కొన్ని నేరాల విషయంలో 18 సంవత్సరాలను బీఎన్ఎస్2 పరిగణలోకి తీసుకోదు. అంటే తల్లిదండ్రులనుంచి డబ్బులు వసూలు చేయడం కోసం కిడ్నాప్‌కు గురైన బాలుడు/బాలిక పదేళ్లలోపు వయస్కులైనప్పుడు మాత్రమే వారిని పిల్లలుగా పరిగణిస్తారు. 11 సంవత్సరాల బాలుడు కిడ్నాప్ అయితే అతడిని పెద్దవాడిగానే బీఎన్ఎస్2 గుర్తిస్తుంది. అదేవిధంగా విదేశాల నుంచి మహిళను దిగుమతి చేసుకున్నప్పుడు ఆమె వయస్సు 21 సంవత్సరాలు దాటితే నేరంగా పరిగణిస్తారు. అదే బాలుర విషయంలో ఈ వయసు 18 సంవత్సరాలు!



### ప్రత్యేక చట్టాలతో ఇతర నేరాల డూప్లికేషన్ (ద్విగుణనం)

- ఇండియన్ పీనల్ కోడ్‌ను రూపొందించినప్పుడు అప్పటికి అన్నికాల నేరాలను ఇందులో చేర్చారు. కాలానుగుణంగా కొన్ని ప్రత్యేక అంశాలకు సంబంధించిన నేరాలను, వాటికి విధించాల్సిన శిక్షలను ఇందులో పొందు పరుస్తూ వచ్చారు. అటువంటి నేరాలను బీఎన్ఎస్2లో తొలగించారు. ఉదాహరణకు మెట్రాలజీ యాక్ట్ – 2009 కింద తూనికలు, కొలతలకు సంబంధించి ఐ.పి.సి.లో పొందుపరచిన నేరాలను బీఎన్ఎస్2లో తీసివే శారు. అయితే ఆవిధంగా చేర్చిన నేరాల్లో చాలా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వీటికితోడు బీఎన్ఎస్2లో వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాదం వంటి నేరాలను కూడా ఇందులో చేర్చారు. ఇప్పటికే ఇవి ప్రత్యేక చట్టాలకింద పొందుపరచి ఉండటంతో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం వుంది. ముఖ్యంగా ఒకే నేరానికి చట్టంలోని వేర్వేరు చట్టాల కింద వివిధ శిక్షలు పేర్కొని ఉండటం ఇందుకు ప్రధాన కారణం. అటువంటి నేరాలను తొలగించడం ద్వారా డూప్లికేషన్ (ద్విగుణనం)ను నివారించవచ్చు.

### వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాదానికి సంబంధించిన నేరాల చేర్పు

- ఐ.పి.సి.లో వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాదం అనే అంశాలను చేర్చలేదు. ఉగ్రవాదాన్ని చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం–1967 (యు.ఎ.పి.ఎ)లో పొందుపరిచారు. వ్యవస్థీకృత నేరాలు, రాష్ట్ర పరిధి నేరాల్లో చేర్చారు. మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల నిరోధక చట్టం 1999 (ఎం.సి.ఒ.సి.ఎ) ఇందుకు ఉదాహరణ. సరిగ్గా ఇటువంటి చట్టాలనే గుజరాత్, ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాలు కూడా రూపొందించి అమలు చేస్తున్నాయి. అయితే వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాదాన్ని బీఎన్ఎస్2లో చేర్చడం తాజా పరిణామం. బీఎన్ఎస్2లో ఉగ్రవాదానికి సంబంధించిన నిబంధన అచ్చంగా యు.ఎ.పి.ఎ.లో మాదిరిగానే ఉంది. ఇప్పుడు వ్యవస్థీకృత నేరాలను బీఎన్ఎస్2లో చేర్చడం ద్వారా, అన్ని రాష్ట్రాలకు వీటిని వర్తింపజేయడానికి వెసులుబాటు కలిగింది. ఎందుకంటే ఈ నేరాలకు సంబంధించి చాలా రాష్ట్రాలు ఏవిధమైన ప్రత్యేక చట్టాలను రూపొందించలేదు. అయితే ప్రత్యేక చట్టాల కింద ఈ నేరాలను అమలు పరుస్తున్న రాష్ట్రాల్లో వ్యవస్థీకత నేరాలు డూప్లికేషన్‌కు గురయ్యే పరిస్థితి ఏర్పడింది.
- కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ 1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో ప్రవేశ పెట్టిన భారతీయ నాగరిక్ (రెండవ) సురక్ష సంహిత 2023, భారతీయ సాక్ష్య (రెండవ) 2023 బిల్లుల్లో ఇటువంటి నేరాలకు (వ్యవస్థీకృత, ఉగ్రవాదం) ప్రత్యేకమైన విధి విధానాలు రూపొందించలేదు. వ్యవస్థీకృత, ఉగ్రవాదంపై రూపొందించిన ప్రత్యేక చట్టాల్లో పేర్కొన్న నిబంధనలకు, సాధారణంగా చేపట్టే నేర ప్రక్రియకు సాన్నిహిత్యం లేకపోవడం గమనార్హం. ఎందుకంటే బెయిల్ మంజూరుకు నిబంధనలను, నేరాన్ని నిందితులు అంగీకరించారంటూ పోలీసులు దాఖలు చేసే అంశాల్లోని అంగీకారయోగ్యతను ప్రశ్నించే వెసులుబాటును ప్రత్యేక చట్టాల్లో తొలగించారు. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ యాక్ట్–2009 కింద యు.ఎ.పి.ఎ. కేసులను విచారిస్తున్నారు. ఈ కేసులను ప్రత్యేక కోర్టులు విచారిస్తాయి. బీఎన్ఎస్2 ఉగ్రవాద కేసులను విచారించడానికి సెషన్స్ కోర్టులకు అనుమతినిస్తుంది. దీనివల్ల ఒకే నేరానికి సంబంధించిన కేసుల్లో దర్యాప్తు, విచారణ ప్రక్రియలు భిన్నంగా ఉండటం కొన్ని సమస్యలకు తావిచ్చే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఇటువంటి వ్యవస్థీకృత నేరాలకు ఒక ప్రత్యేక క్రిమినల్ ప్రొసీజర్‌ను భారతీయ నాగరిక సురక్షా సంహిత 2023లో పొందుపరచాలని స్టాండింగ్ కమిటీ ఆన్ హోమ్ అఫైర్స్–2023 సిఫారసు చేయడం గమనార్హం.

### వ్యక్తిగత గ్యాంగ్ నేరాల్లో శిక్షలు భిన్నం

- బీఎన్ఎస్2లో వ్యవస్థీకృత స్వల్ప నేరాల (పెట్టీ క్రైమ్)ను చేర్చారు. వాహనాల దొంగతనం, జేబులు కొట్టడం, ప్రశ్నా పత్రాలు అమ్ముకోవడం వంటి నేరాలు దీని పరిధిలోకి వస్తాయి. ఒక గ్యాంగ్ చేసిన స్వల్ప నేరాన్ని వ్యవస్థీకృత నేరంగా పరిగణిస్తారు. నేరం రుజువైతే ఏడాది నుంచి ఏడేళ్ల జైలుశిక్ష జరిమానా విధించవచ్చు. ఇదే నేరానికి ఒక వ్యక్తి పాల్పడినట్లయితే శిక్ష భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు దొంగతనానికి ఒక వ్యక్తి పాల్పడితే మూడేళ్ల వరకు జైలుశిక్ష విధించవచ్చు. ఇదే నేరాన్ని ఒక గ్యాంగ్ చేసినట్లయితే ఏడాదినుంచి ఏడేళ్ల వరకు శిక్షపడుతుంది.

**మహిళలపై నేరాలు**




- మహిళలపై అత్యాచారానికి సంబంధించి ఐ.పి.సి.లో పేర్కొన్న నిబంధనలను బీఎన్ఎస్2లో మార్చలేదు. అయితే జస్టిస్ వర్మ కమిటీ–2013 సిఫారసులు, సుప్రీం కోర్టు ఇచ్చిన సంస్కరణలతో కూడిన తీర్పులను పట్టించుకోలేదు.
- ఇదిలావుండగా పోలీసులు తనిఖీలు, స్వాధీనం వంటి చర్యలు తీసుకున్నప్పుడు వీడియో తీయడం తప్పనిసరి. ఇక ఏడేళ్లు అంతకంటే ఎక్కువ శిక్షార్హమైన నేరాల్లో ఫోరెన్సిక్‌ను తప్పనిసరి చేయడం మరో పరిణామం. ఈ సందర్భంగా వీడియోగ్రఫీని తప్పనిసరి చేసింది. కేసును విచారించి, తీర్పు చెప్పడానికి నియమిత కాల వ్యవధిని బీఎన్ఎస్2 నిర్దేశించింది.
- వర్తమాన కాలానికి అనుగుణంగా ప్రభుత్వం తీసుకొచ్చిన బీఎన్ఎస్2 ప్రజల సుఖశాంతులు, సామాజిక భద్రత, దేశసమైక్యత, సమగ్రతలను పరిరక్షించే లక్ష్యమే పరమావధిగా వుండటంతో, ప్రజలకు న్యాయవ్యవస్థ మరింత చేరువయ్యేందుకు వీలుకలుగుతుందని భావించవచ్చు.

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్



## ఎస్ఎస్‌సీ- సీజీఎల్ -2024



కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (సీజీఎల్)ఎగ్జామ్-2024 నోటిఫికేషన్‌ను స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 17727
- **పోస్టులు:** గ్రూప్ బీ, సీ (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, ఎస్ఐ, ఆడిటర్, అకౌంటెంట్, ట్యాక్స్ అసిస్టెంట్) తదితరాలు
- **అర్హతలు:** స్టాటిస్టికల్ పోస్టులకు డిగ్రీలో స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. మిగిలిన పోస్టులకు డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** వేర్వేరు పోస్టులకు వేర్వేరుగా ఉంది. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- **ఎంపిక:** టైర్–1, టైర్–2 పరీక్షల ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 24
- **వెబ్‌సైట్:** https://ssc.gov.in/home

### విద్య, ఉద్యోగ సమాచారం

## ఆర్ఐఈలో...

**మైసూర్‌లోని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్ఐఈ)లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 20
- పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రీ ప్రైమరీ టీచర్, పీజీటీ, ల్యాబొరేటరీ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్ తదితరాలు
- సబ్జెక్టులు: ఫిజిక్స్, మ్యాథ్స్, జువాలజీ, ఐటీ, ఇంగ్లిష్ తదితరాలు
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ తేదీలు: జూలై 1, 2, 3
- వెబ్‌సైట్: www.riemysore.ac.in

## నేషనల్ హైవేస్‌లో..

**నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాలో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 38
- పోస్టులు: ప్రిన్సిపల్ డీపీఆర్ ఎక్స్‌పర్ట్, ట్రాఫిక్ ఎక్స్‌పర్ట్, బ్రిడ్జి ఎక్స్‌పర్ట్, టన్నల్ ఎక్స్‌పర్ట్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జూలై 18
- వెబ్‌సైట్: www.nhai.gov.in

## ఉచిత సివిల్స్ కోచింగ్

**హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ స్టడీ సర్కిల్ 2024-25 విద్యాసంవత్సరానికిగాను సివిల్స్ సర్వీస్ ఎగ్జామ్ ఉచిత కోచింగ్ కోసం ప్రకటన విడుదల చేసింది.**

- యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఎగ్జామ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్)
- సీట్ల సంఖ్య: 100. దీనిలో ఎస్టీలకు 75 శాతం, ఎస్సీలకు 15, బీసీలకు 10 శాతం కేటాయిస్తారు.
- అర్హతలు: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 3 లక్షలు మించరాదు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జూన్ 30
- వెబ్‌సైట్: https://studycircle.cgg.gov.in

## ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- భారత న్యాయ సంహిత, డీఎస్సీ సైన్స్ కంటెంట్ ప్రత్యేకం కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

# కేంద్రీయ అటవీ నేలల పరిశోధన కేంద్రం ఎక్కడ ఉంది?




1. **భారతదేశంలో ఎడారి మృత్తికకు సంబంధించి సరైన వివరణ కానిది ఏది ?**
   ఎ. భారతదేశంలో వాయవ్యాన, ఆరావళి పర్వతాలకు పశ్చిమాన ఎడారి నేలలు విస్తరించి ఉన్నాయి
   బి. ఎడారి మృత్తికలు నైట్రేట్స్, ఫాస్పేట్స్‌కు ప్రసిద్ధి చెందినవి
   సి. రాజస్థాన్‌లో ఎడారి నేలల ప్రాంతంలో ప్రముఖ సరిస్కా టైగర్ రిజర్వు ఉంది
   1) ఎ, బి 2) బి, సి
   3) పైవన్నీ 4 పైవేవి కావు
2. **కింది వివరణలు గమనించండి**
   ఎ. ఉత్తర భారతదేశంలో ప్రముఖ హ్యూమస్‌కు ప్రసిద్ధి చెందిన నేలలుగా పర్వతీయ నేలలను చెప్పవచ్చు
   బి. హిమాలయాల్లో డూన్స్, దక్షిణ భారతదేశంలో గల నీలగిరి పర్వతాలు ప్రముఖ పండ్ల తోటలు సుగంధ ద్రవ్యాల పంటలకు ప్రసిద్ధి
   **పై అటవీ నేలలకు సంబంధించి సరైనది ఏది?**
   1) ఎ, బి 2) ఎ
   3) బి 4) పైవేవీ కావు
3. **కింది వివరణలు గమనించండి**
   ఎ. ప్రధానంగా మృత్తిక క్రమక్షయం గాలి, నీరు వల్ల సంభవిస్తుంది
   బి. పశ్చిమ కనుమల్లో మృత్తిక క్రమక్షయం వల్ల పై మృత్తిక కొట్టుకుపోయి గులకరాళ్లు గల శిలా ఉపరితలం ఏర్పడుతుంది
   **పై ప్రవచనాల్లో సరైన వివరణ ఏది?**
   1) ఎ, బి 2) ఎ
   3) బి 4) ఏదీకాదు
4. **కింది వాటిలో సరైనది ఏది?**
   ఎ. అటవీకరణ చేపట్టడం వల్ల నేల క్రమక్షయం నివారించవచ్చు
   బి. గడ్డి పెంపకం అధికంగా చేపట్టడంతో నేల క్రమక్షయం నివారణపై అంతగా ప్రభావం చూపించదు. కానీ పశువుల మేత కొరత నివారించవచ్చు.
   నేల క్రమక్షయం నివారణ చర్యలేవి ?
   1) ఎ, బి 2) ఎ
   3) బి 4) ఏదీకాదు
5. **కింది వాటిని జతపరచండి.**
   ఎ. ఊటి — 1. నల్లరేగడి నేలల పరిశోధన కేంద్రం
   బి. బళ్లారి — 2. కేంద్రీయ అటవీ నేలల పరిశోధన కేంద్రం
   సి. పస్సద్ — 3. గుజరాత్ అవనాళిక పరిశోధన కేంద్రం
   1) ఎ–2, బి–3, సి–1
   2) ఎ–1, బి–2, సి–3
   3) ఎ–2, బి–1, సి–3
   4) ఎ–3, బి–2, సి–1
6. **కింది వాటిని జతపరచండి.**
   ఎ. కలకత్తా — 1. యమున అవనాళిక పరిశోధనా కేంద్రం
   బి. ఆగ్రా — 2. రాజస్థాన్ అవనాళిక పరిశోధనా కేంద్రం
   సి. కోటా — 3. సాయిల్ సర్వే ఆఫ్ ఇండియా
   1) ఎ–1, బి–2, సి–3
   2) ఎ–3, బి–1, సి–2
   3) ఎ–1, బి–3, సి–2
   4) ఎ–3, బి–2, సి–1
7. **కింది వాటిని జతపరచండి.**
   ఎ. 3వ దశ — 1. నీటి పారుదల ప్రాజెక్టుల అభివృద్ధి
   బి. 2వ దశ — 2. ఎఫ్‌సీఐ సంస్థ ఏర్పాటు
   సి. 1వ దశ — 3. హైబ్రిడ్ విత్తనాల అభివృద్ధి
   **వ్యవసాయ విధానంలో వచ్చిన మార్పుల్లో సరైన జత ఏది?**
   1) ఎ–2, బి–3, సి–1
   2) ఎ–1, బి–2, సి–3
   3) ఎ–2, బి–1, సి–3
   4) ఎ–3, బి–2, సి–1
8. **కింది వాటిని జతపరచండి.**
   ఎ. నల్ల విప్లవం — 1. జనపనార ఉత్పత్తి
   బి. గుండ్రని విప్లవం — 2. కిరోసిన్ విప్లవం
   సి, బంగారు పీచు విప్లవం — 3. బంగాళదుంప ఉత్పత్తి
   1) ఎ–2, బి–3, సి–1
   2) ఎ–1, బి–2, సి–3
   3) ఎ–2, బి–1, సి–3
   4) ఎ–3, బి–2, సి–1
9. **కింది వాటిలో సరికాని జత గుర్తించండి.**
   1. నూనె గింజల ఉత్పత్తి – పసుపు విప్లవం
   2. కోడిగుడ్లు, కోళ్ల ఉత్పత్తి – వెండి విప్లవం
   3. ఆపిల్ ఉత్పత్తి – బంగారు విప్లవం
   4. ఫార్మాస్యూటికల్ ఉత్పత్తి– ఊదా విప్లవం
10. **కింది వాటిలో సరైనది?**
    ఎ. నల్లరేగడి నేలలను ఉష్ణమండల చెర్నోజెమ్ నేలలు అని కూడా పిలుస్తారు
    బి. బసాల్ట్ శిలలు శైథిల్యం చెందడం వల్ల ఏర్పడిన నేలలను లాటరైట్ నేలలు అని పిలుస్తారు
    సి. గ్రానైట్, స్ఫటికాకార రూపాంతర శిలలు శైథిల్యం చెందడం వల్ల ఎర్ర మృత్తికలు ఏర్పడతాయి
    1) ఎ, బి 2) ఎ, సి
    3) బి, సి 4) ఎ, బి, సి
11. **కింది వాటిని పరిశీలించండి.**
    ఎ. భారతదేశంలో పాల ఉత్పత్తిలో మొదటి స్థానంలో గల రాష్ట్రం ఉత్తరప్రదేశ్
    బి. భారతదేశంలో స్వాతంత్ర్య అనంతరం ఆహార కొరత ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం అమెరికాతో పబ్లిక్ లా పథకం ద్వారా గోధుమలు, పాల పిండిని దిగుమతి చేసుకుంది
    సి. హరిత విప్లవం అనే పదం మొదట ఉపయోగించిన వ్యక్తి నార్మన్ బోర్లాగ్
    **పై సమాచారంలో సరైనది ఏది?**
    1) ఎ 2) ఎ, బి
    3) పైవన్నీ 4) బి, సి
12. **కింది వాటిని పరిశీలించండి.**
    ఎ. పత్తి, సజ్జ, జనుము, శనగలు, మొక్కజొన్న
    బి. గోధుమ, శనగలు, బార్లీ, ఆవాలు
    సి. గోధుమ, ఆవాలు, జనుము, సజ్జ
    పై సమాచారంలో రబీ కాల పంటలను గుర్తించండి?
    1) ఎ, బి 2) బి, సి
    3) బి 4) సి
13. **కింది శాస్త్రీయ నామాలను జతపరచండి.**
    ఎ. జొన్న — 1. కజానస్ కజాన్
    బి. కందులు — 2. పెన్నిసెటమ్ గ్లాకుమ్
    సి. సజ్జ — 3. సోర్గమ్ వల్గేరే
    1) ఎ–1, బి–2, సి–3
    2) ఎ–3, బి–1, సి–2
    3) ఎ–3, బి–2, సి–1
    4) ఎ–2, బి–1, సి–3
14. **సరికాని జతను గుర్తించండి.**

| అంశం | ప్రవేశ పెట్టిన వ్యక్తి |
|---|---|
| 1. ఇంద్ర ధనుస్సు విప్లవం | నితిన్ కుమార్ |
| 2. హరిత విప్లవం | ఎం.ఎస్ స్వామినాథన్ |
| 3. బంగారు వరి | ఇంగో ప్రాస్టికస్ |
| 4. సూపర్ గోధుమ | ఎస్.నాగరాజు |

    1) 1, 2 2) 3, 4 3) పైవన్నీ సరైనవే 4) ఏదీ సరైనది కాదు
15. **కింది పరిశోధనా కేంద్రాల్లో సరికానిది ఏది?**
    1. నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆన్ పిగ్స్–రాని (గువాహటి)
    2. అరటి పరిశోధన కేంద్రం– తిరుచురాపల్లి
    3. నేషనల్ టొబాకో రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్– రాజమండ్రి
    1. 1 2. 1, 2
    3. 1, 2, 3 4. ఏదీకాదు
16. **భారత ప్రభుత్వం సీ బర్ట్ హార్న సాగును ప్రోత్సహిస్తుంది. దీని ప్రాముఖ్యత ఏమిటి?**
    1. నేల క్రమక్షయం నియంత్రించడంలో సహాయపడుతుంది
    2. ఇది బయో డీజిల్‌కు మంచి వనరు
    3. దీనిలో పోషక విలువ ఉంది. ఎత్తయిన ప్రాంతాల్లో, శీతల ప్రాంతాల్లోనూ జీవించడానికి అనుకూలంగా ఉంటుంది
    4. దీని కలప వాణిజ్య పరంగా విలువైనది
    **పై వివరణల్లో సరైనది ఏది?**
    1) 1, 2 2) 1, 2, 3
    3) 1, 3 4) 1, 2, 3, 4
17. **భారతదేశంలోని కింది పంటలను పరిశీలించండి.**
    1. వేరుశనగ 2. నువ్వులు
    3. పెసర 4. గోధుమ
    **పైన పేర్కొన్న వాటిలో ప్రధాన వర్షాధార పంటలేవి?**
    1) 1 2) 3
    3) 1, 2 4) 1, 2, 3, 4
18. **సూక్ష్మ సేద్యానికి (బిందు సేద్యం) సంబంధించి కింది స్టేట్‌మెంట్లలో సరైనది ఏది?**
    1. సేంద్రియ ఎరువులు లేదా పోషక విలువలు కోల్పోవడాన్ని తగ్గించడం
    2. మెట్ట భూముల సాగుకు అనుకూలమైన వ్యవసాయ పద్ధతి
    3. భూగర్భ జలాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ విధమైన సాగు అనుకూలం
    1) 1 2) 2
    3) 1, 3 4) 1, 2, 3
19. **కింది వాటిలో సరిగా జతచేసినవి ఏవి?**
    1. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్– నాగపూర్
    2. నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్– ఢిల్లీ
    3. మినరల్ హార్ట్ ల్యాండ్ ఆఫ్ ఇండియా– ఛోటానాగపూర్ పీఠభూమి
    1) 1, 2 2) 1
    3) 2, 3 4) 1, 2, 3
20. **కింది వాటిని పరిశీలించండి.**
    1. శిలలో ఖనిజాలు సాంద్రీకరణ చెందినట్లయితే దాన్ని ధాతువు అంటారు. ధాతువు మలినాలను లేదా వివిధ ఖనిజాల కలయికగా ఉంటుంది
    2. భారతదేశంలో ఖనిజ విధానాన్ని పరిశీలించడానికి నియమించిన కమిటీ హుడా కమిటీ
    3. ఒకటి– ఒకటి కంటే ఎక్కువ మూలకాలు భూపటలంలో రసాయనికంగా సంయోగం చెంది ఏర్పడే ఘన స్థితిలో గల కర్బన, అకర్బన సమ్మేళనాలను ఖనిజాలు అంటారు
    1) 1 2) 1, 2
    3) 2, 3 4) 1, 2, 3
21. **కింది వాటిని పరిశీలించండి.**
    1. ఛత్తీస్‌గఢ్ – బైలడిల్లా, బస్తర్‌దూర్
    2. జార్ఖండ్ – సింగ్‌భం, నోవమండి
    3. ఒడిశా – బీర్‌భం, గుర్వ్యాన్
    **భారతదేశంలో ఇనుప ఖనిజం లభించే ప్రాంతాల్లో సరైన జత ఏది?**
    1) 1 2) 1, 2
    3) 2, 3 4) 1, 2, 3
22. **కింది ప్రవచనాలు పరిశీలించి సరైనది గుర్తించండి.**
    1. ప్రపంచంలో మొదటిసారిగా ఉపయోగించిన ఖనిజం రాగి
    2. భారతదేశంలో ఖనిజ సంపద అత్యల్పంగా గల ప్రాంతం గంగా మైదాన ప్రాంతం
    1) 1 2) 1, 2
    3) 2 4) ఏదీకాదు
23. **కింది వాటిలో సరికానిది?**
    1) ఇలైమలై కొండలను కార్డమమ్ కొండలు అని పిలుస్తారు
    2) పళని కొండలు కేరళ రాష్ట్రంలో విస్తరించి ఉన్నాయి
    3) ద్వీపకల్ప పీఠభూమిలో ఎత్తయిన శిఖరం అనైముడి
    4) గంగా–సింధూ మైదానం ప్లీస్టోసీన్ కాలం నుంచి నేటి వరకు ఏర్పడుతుంది
24. **బైలాడిల్లాలోని ఇనుప ఖనిజం ప్రధానంగా కింది ఏ ఓడరేవు ద్వారా జపాన్‌కు రవాణా చేస్తున్నారు?**
    1) జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్
    2) విశాఖపట్నం పోర్ట్
    3) మంగళూర్ పోర్ట్
    4) హల్దియా పోర్ట్
25. **కింది వాటిలో సరికానిది ఏది?**
    1) కోయంబత్తూరును 'మాంచెస్టర్ ఆఫ్ సౌత్ ఇండియా' అని పిలుస్తారు
    2) భారత్‌లో తొలి ఇనుము – ఉక్కు పరిశ్రమను ' పోర్టోనోవా' వద్ద ఏర్పాటు చేశారు
    3) 1907లో సక్చి వద్ద జంషెడ్‌జీ టాటా 'టిస్కో'ను ఏర్పాటు చేశారు
    4) 1937లో 'అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'ను దామన్ జోడి వద్ద ఏర్పాటు చేశారు

**సమాధానాలు**

| | | | |
|---|---|---|---|
| 1. 4 | 2. 1 | 3. 1 | 4. 2 |
| 5. 3 | 6. 2 | 7. 1 | 8. 1 |
| 9. 4 | 10. 2 | 11. 2 | 12. 3 |
| 13. 2 | 14. 4 | 15. 4 | 16. 3 |
| 17. 3 | 18. 3 | 19. 4 | 20. 4 |
| 21. 2 | 22. 2 | 23. 2 | 24. 2 |
| 25. 4 | | | |

టాపర్స్ ఇన్‌స్టిట్యూట్,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్